
ఇంటర్ విద్యలో.. సమూల మార్పులు!

- సీబీఎస్ఈకి అనుగుణంగా సిలబస్‌కు సన్నాహాలు
- కళాశాల స్థాయిలోనే ప్రథమ సంవత్సరం పరీక్షలు
- రెండో ఏడాదిలో బోర్డు ద్వారా పరీక్షా ఫలితాలు
- ప్రతిపాదనలపై ఈ నెల 26లోగా అభ్యంతరాల స్వీకరణ


పరీక్షలకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు

నరసన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు.. మార్కులు.. ర్యాంకులు అంటూ విద్యార్థులపై ఒత్తిడి పెరిగింది. ప్రధానంగా ఇంటర్మీడియట్ విద్యార్థులపై ఒత్తిడి తీవ్రస్థాయిలో ఉండడంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. తెలుగు రాష్ట్రాలు మినహా దేశంలో ఎక్కడా ఇంటర్ మొదటి ఏడాది పరీక్షలను నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో కూడా ఇంటర్ విద్యలో సమూల మార్పులకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని భావిస్తోంది. జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలు చేయనున్నట్టు ఇటీవల ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికాశుక్లా వెల్లడించారు.

● జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు 71, మోడల్ జూనియర్ కళాశాలలు -13, కేజీబీవీ కళాశాలలు -25, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలు -9, ట్రైబుల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ కళాశాల -1, జిల్లాపరిషత్ ప్లస్ 2 కళాశాలలు -6 , మహాత్మ జ్యోతిరావుపూలే మహిళ జూనియర్ కళాశాల -1. మొత్తం 164 కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో మొదటి సంవత్సరం 20,678 మంది, రెండవ సంవత్సరం 18,792 మంది విద్యార్థులు చదువుతున్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఫస్ట్ ఇయర్‌లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. పాఠశాల విద్యాశాఖ 2024-25 విద్యాసంవత్సరం నుంచి పదో తరగతిలో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టింది. తదనుగుణంగా 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో కూడా ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలను తీసుకురావాల్సి ఉంది. జాతీయస్థాయి పోటీ పరీక్షలైన నీట్, జేఈఈ, సీఏలు సిలబస్‌కు అనుగుణంగా ఈ మార్పులు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న మూల్యాంకనాన్ని పరిగణలోకి తీసుకుని.. రాష్ట్రంలో కూడా ఇంటర్ మొదటిసంవత్సరం పరీక్షలను బోర్డు నిర్ణయించిన బ్లూప్రింట్ ఆధారంగా కళాశాలలో ఇంటర్నల్‌గా నిర్వహిస్తారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలను మాత్రం ప్రస్తుత విధానంలో బోర్డు నిర్వహించి ఫలితాలు విడుదల చేస్తుంది.

సీబీఎస్ఈ విధానం ఇలా..

ఇంటర్మీడియట్ విద్య సీబీఎస్ఈ విధానంలోకి మారనుంది. ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు రెండు భాషలతో పాటు ఆ గ్రూపునకు సంబంధించిన సబ్జెక్టులు ఉన్నాయి. సైన్స్ విద్యార్థులకు నాలుగు సబ్జెక్టులు, ఆర్ట్స్‌కు మూడు సబ్జెక్టుల విధానం ఉంది. ఇప్పుడు ఎంపీసీ విద్యార్థులకు ఉన్న మ్యాథ్స్ పేపర్లను ఒకే పేపర్‌గా, బైపీసీ విద్యార్థులకు బోటని, జువాలజీని ఒకే పేపర్‌గా తీసుకొస్తున్నారు.

ప్రక్షాళన అవసరం..



మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇంటర్ విద్యలో ప్రక్షాళన అవసరం. సైన్సు విద్యార్థులకు జాతీయస్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలకు సీబీఎస్ఈ విధానం ఎంతో దోహదం చేస్తుంది. కార్పొరేట్ కళాశాల విద్యార్థులకు పరిమితమయ్యే నీట్, జేఈఈలు ప్రభుత్వ కళాశాలలో చదివే వారికి కూడా ఈ విధానం ద్వారా దోహద పడుతుంది.

-కింతలి సత్యనారాయణ, రిటైర్డ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్

ఆర్ట్స్ సిలబస్‌లో కూడా..



సీబీఎస్ఈ విధానం తీసుకురావడం మంచిదే. ఆర్ట్స్ చదివే విద్యార్థులు అంటే చులకన లేకుండా ఇంటర్ స్థాయి నుంచి సీఏ, యూపీఎస్‌సీ నిర్వహించే పరీక్షలకు పోటీ పడే విధంగా కరిక్యూలమ్ రూపొందించాలి. సీబీఎస్ఈ విధానంతో ఆర్ట్స్ సబ్జెక్టులకు ఆదరణ పెరుగుతుంది.

-ఎం.ఆర్ జ్యోతి ఫెడరిక్, రిటైర్డ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ప్రతిపాదనలు చేపట్టింది..



సీబీఎస్ఈ విధానంలో వచ్చే ఏడాది నుంచి ఇంటర్ విద్యలో మార్పులకు ఇంటర్ బోర్డు ప్రతిపాదనలు రూపొందించింది. ఈనెల 26లోగా ఏవైనా అభ్యంతరాలు ఉంటే తల్లిదండ్రులు, విద్యావేత్తలు పంపించవచ్చును. కొత్తవిధానంపై కసరత్తు జరుగుతోంది.

-దుర్గారావు, ఆర్ఐవో, ఇంటర్ విద్య

నూతన సబ్జెక్టు కాంబినేషన్లు ..

ఇంగ్లీష్ సబ్జెక్టు అందరికి కచ్చితంగా ఉంటుంది. ద్వితీయ సబ్జెక్టుగా ఏదైనా భాష కానీ లేదా ఇతర గ్రూపునకు చెందిన ప్రధాన సబ్జెక్టుకానీ ఎంపిక చేసుకోవచ్చు. దీని కోసం 23 ఆప్షన్లు ఉంటాయి. అంటే ఎంపీసీ చదివే విద్యార్థులు జువాలజీ, బోటనీ సబ్జెక్టు కానీ ఆర్ట్స్ సబ్జెక్టుగాని తీసుకోవచ్చు. మూడు, నాలుగు, ఐదో సబ్జెక్టులు ఎంపిక చేసుకున్న గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. ఐచ్ఛికంగా 6వ సబ్జెక్టు ఉంటుంది. దీనికి కూడా భాష లేదా ఇతర గ్రూపునకు చెందిన 23 ఆప్షన్ల నుంచి ప్రధాన సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు. ప్రధానంగా ఎంచుకున్న ఐదు సబ్జెక్టులలో ఒకటి తప్పితే, ఆప్షన్ సబ్జెక్టు పాసైతే దానిని పరిగణనలోకి తీసుకుని విద్యార్థులను ఉత్తీర్ణత చేస్తారు. ఈ విధానం అమలవ్వాంటే ఐదు ప్రధాన సబ్జెక్టుల్లో ఇంగ్లీష్ తప్పనిసరిగా ఉండాలి.

మార్కులు ఇలా..

ఇప్పటివరకు ప్రథమ సంవత్సరంలో 500 మార్కులకు, ద్వితీయ సంవత్సరంలో 500 మార్కులకు **(మిగతా 8వ పేజీలో..)**


గొప్పిలి సచివాలయం

సచివాలయాలు ప్రక్షాళన

- మూడు విభాగాలుగా విభజన
- జనాభా ప్రాతిపదికన ఉద్యోగుల కేటాయింపు

మెళియాపుట్టి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సచివాలయాల ప్రక్షాళనపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వీటిని మూడు విభాగాలు విభజించాలని నిర్ణయించింది. జనాభా ప్రాతిపదికన ఉద్యోగులను కేటాయించేందుకు చర్యలు చేపడుతోంది. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత దగ్గర చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. కాగా.. ముందుచూపు లేకుండా అధికంగా ఉద్యోగులను నియమించడంతో ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోంది. కొంతమంది ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచి.. మరికొందరిని ఖాళీగా ఉంచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా ఆధారంగా ఉద్యోగులను కేటాయించి.. సేవలు మెరుగుపరచాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. మల్టీపర్పస్, టెక్నికల్, ఆస్పిరేషనల్ కార్యదర్శులుగా ఉద్యోగులను విభజించేందుకు సిద్ధమవుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో 930 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 835 గ్రామ, 95 వార్డు సచివాలయాలు. వివిధ శాఖలకు సంబంధించి 8,056 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో పది మంది, వార్డు సచివాలయాల్లో 8 మంది చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. అధికంగా జనాభా ఉన్న పట్టణ ప్రాంతాల్లో కన్నా.. తక్కువ జనాభా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది సిబ్బంది ఉండడం చర్చనీయాంశమవుతోంది. ఉద్యోగుల కేటాయింపు సక్రమంగా లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2,500 మంది జనాభా, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను యూనిట్‌గా తీసుకుని ఉద్యోగులను కేటాయించనుంది. సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, సంక్షేమ కార్యదర్శులు, మహిళా పోలీసులు వారి విధులతోపాటు ఇకపై బహుళార్థక సేవలు అందించేలా చర్యలు చేపట్టనుంది. సంక్షేమ కార్యక్రమాల అమలు సర్వేలు, తదితర బాధ్యతలను అప్పగించనుంది. ఆరోగ్యం, ఉద్యానవన, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, ఇంజనీర్, విద్యుత్ శాఖ సిబ్బంది సాంకేతిక సేవా కార్యదర్శులుగా వ్యవహరించనున్నారు. ఇందుకు సంబంధించి కేబినెట్‌లో నిర్ణయం తీసుకోగా త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నట్టు తెలుస్తోంది.

చరిత్ర ఘనం.. పర్యవేక్షణ శూన్యం

- ఇదీ పట్టుమహాదేవి కోనేరు దుస్థితి
- పిచ్చిమొక్కలు, దుర్గంధంతో నిండిన వైనం

8 లో

- వేలాది ఎకరాలకు అందని సాగునీరు
- పనులు వదిలేసిన కాంట్రాక్టర్
- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

అనుసంధానం.. అర్థాంతరమేనా?


వెన్నెలవలస వద్ద అర్ధాంతరంగా నిలిచిన వంశధార, నాగావళి నదుల అనుసంధాన నిర్మాణ పనులు



సరుబుజ్జిలి, జనవరి 19(ఆంధ్రజ్యోతి):

ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో (201-19) సీఎం చంద్రబాబు నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా జిల్లాలోని వంశధార, నాగావళి నదుల అనుసంధానాన్ని పూర్తి చేసి హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు చెందిన రైతులకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. అలాగే నాగావళి పరివాహక ప్రాంతాల రైతులకు కూడా నీరందించేందుకు 2017లో పనులు ప్రారంభించారు. కొంతమేర పనులు చేపట్టారు. కాగా.. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంశధార, నాగావళి నదుల అనుసంధానంపై నిర్లక్ష్యం వహించింది. సాగునీటి ప్రాజెక్టులపై శీతకన్ను వేసింది. నిధులు లేక నదుల అనుసంధానం పనులు నిలిచిపోయాయి. దీంతో అన్నదాతలకు సాగునీరు అందక కరువు పరిస్థితులు వెంటాడాయి. వేలాది ఎకరాలకు సాగునీరు అందకపోవడంతో వైసీపీ ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. ఇటీవల కూటమి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నాగావళి-వంశధార నదుల అనుసంధానానికి సీఎం చంద్రబాబు నిధులు కేటాయించడంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలో ఏడు మండలాల్లోని 92 గ్రామాల్లో 37,053 ఎకరాలకు సాగునీటిని పుష్కలంగా అందించడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం 2017లో వంశధార, నాగావళి నదుల అనుసంధానానికి అనుమతులు మంజూరు చేసింది. వంశధార రిజర్వాయర్ నుంచి నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్టు వరకు 33.5 కిలోమీటర్లు పొడవునా కాలువ నిర్మాణం తలపెట్టింది. దీంతో విజయనగరం జిల్లా సంతకవిటి మండలంతో పాటు జిల్లాలోని పొందూరు, ఎచ్చెర్ల, బూర్జ, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాల రైతులు ఎంతో సంబరపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఇంత ముఖ్యమైన ప్రాజెక్టు పనులపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఫలితంగా పూర్తిస్థాయిలో నీరందక అన్నదాతలకు సాగు భారమైంది. మూడేళ్లుగా వర్షాభావ పరిస్థితులు ఎదురుకావడంతో నారాయణపురం ఆనకట్టు పరిధిలో ఏటా పది వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని అధికారులు, రైతులు అంచనా. దీని ప్రకారం మూడేళ్లలో రూ.100 కోట్లు వరకు పంటను నష్టపోవాల్సి వచ్చిందని చెబుతున్నారు.

వైసీపీ పాలనలో 13 శాతమే పూర్తి..

వంశధార, నాగావళి నదుల అనుసంధానం కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.89.90 కోట్లు నిధులు మంజూరు చేసింది. 2017 మార్చి 27న పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. నెల్లూరుకు చెందిన పి.వి.రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు ప్రాజెక్టు పనులను అప్పగించింది. నిబంధనల ప్రకారం అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి చేయాలి. కానీ టీడీపీ హయాంలో 60 శాతం పనులు పూర్తయ్యాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిపై శ్రద్ధ చూపకపోవడంతో అంచనా వ్యయం పెరిగింది. 2023 నాటికి అధికారులు పనుల విలువను రూ.145 కోట్లకు పెంచారు. గత ఐదేళ్లలో కేవలం 13 శాతం మాత్రమే పనులు చేపట్టారు. ఇంకా 27శాతం పనులు చేపట్టాలి. చేపట్టిన పనులకు రూ.115కోట్లు చెల్లించారు. ఇంకా రూ.20 కోట్ల బిల్లులు ఇవ్వాల్సి ఉంది.

● నదుల అనుసంధానంతో హిరమండలం రిజర్వాయర్ గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసేచోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్టు వద్ద కాలువ కలిసేచోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీనితోపాటు నారాయణపురం ఆనకట్టు ప్రధాన కాలువ కింద ఉన్న 37,053 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

పరిహారం చెల్లింపుల్లో జాప్యం..

హైలెవెల్ కెనాల్ పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయినా ప్రభుత్వం నేటికీ రైతులకు పరిహారం డబ్బులు చెల్లించలేదని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు మరో 49.23 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించినా ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదు. ఇందుకోసం రూ.8.26కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది. కాంట్రాక్టుకు రూ.కోటి మేర బకాయిలు చెల్లించకపోవడంతో పనులు అర్ధాంతరంగా ఆపేసి వెళ్లిపోవడంతో ఎక్కడి **(మిగతా 8వ పేజీలో..)**

పేకాట జోరు

- జిల్లాలో రెండుచోట్ల 18 మంది అరెస్టు
- శ్రీకాకుళంలో రూ.11.13 లక్షలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేళ.. జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. ఆదివారం శ్రీకాకుళం, జి.సిగడాం మండలాల పరిధిలో 18 మంది పేకాడుతూ.. పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి పోలీసులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళంలోనే 12 మంది పోలీసులకు పట్టుబడగా.. వారి నుంచి రూ.11.13 లక్షలు స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశమవుతోంది. వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళంలోని హయాతినగరం సమీపంలో ఆదివారం రాత్రి 12 మంది ఓ భవనం మేడ మీద పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. ఆ 12 మందిని అదుపులోకి తీసుకుని.. వారి నుంచి రూ.11.13 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఇంత పెద్ద స్థాయిలో పేకాట సొమ్ము దొరకడంతో కలకలం రేగింది. పేకాడుతూ చిక్కిన వారిలో పలువురు ప్రముఖులు కూడా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. మరోవైపు జిల్లా నుంచి ఒడిశా సరిహద్దు ప్రాంతాలకు పేకాట బృందాలు తరలివెళ్తున్నాయని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో నిర్వాహకులపై పోలీసుబాస్ కొరడా ఝులిపించారు. ఈ మేరకు మెళియాపుట్టి పోలీసులు పేకాట నిర్వాహకులను పట్టుకుని ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేయించారు. దీంతో సరిహద్దు **(మిగతా 7వ పేజీలో..)**


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వివాహిత దారుణ హత్య

- వివాహేతర సంబంధం కోణంలో దర్యాప్తు
- 24 గంటల తరువాత వెలుగులోకి ఘటన
- అనుమానితుడి కోసం గాలింపు

7 లో

డివైడర్‌ను ఢీకొని..

- బైక్‌పైకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం
- ఒడిశా వాసులు ఇద్దరి మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- ఇచ్ఛాపురంలో విషాద ఘటన

8 లో


వినోద్‌రెడ్డి, కార్తీక్ మృతదేహాలను పరిశీలిస్తున్న స్థానికులు


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

బస్సెక్కాలంటే ఎన్ని కష్టాలో..

- స్వగ్రామాల నుంచి తిరుగు పయనమైన వలస జీవులు
- కిటకిటలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్
- రద్దీ రూట్లలో అదనపు సర్వీసులు

సంక్రాంతి సెలవులు ముగిశాయి. పండుగ నేపథ్యంలో స్వగ్రామాలకు తరలివచ్చిన వారంతా ఆదివారం తిరుగుపయనమయ్యారు. ఈ నేపథ్యంలో బస్సులు కిటకిటలాడాయి. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ కనిపించింది. అధిక శాతం మంది ప్రయాణికులు విశాఖపట్నం వైపు వెళ్లే బస్సుల కోసం నిరీక్షించారు. రద్దీ నేపథ్యంలో బస్సు ఎక్కేందుకు.. బస్సులో సీటు దక్కించుకునేందుకు ఎన్నో కష్టాలు పడ్డారు.

7 లో

పేకాట జోరు

(ఐదో పేజీ తరువాయి)

ప్రాంతంలో పేకాట శిబిరాలు నిలిపివేశారు. అయితే శ్రీకాకుళంలో పేకాట శిబిరాలు కనిపించడంతో మరోసారి ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హయాతీనగరంలో పట్టుబడిన 12 మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేవామని ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

మెట్టవలసలో..

జి.సిగడాం: జి.సిగడాం మండలం మెట్టవలస పరిధి కొండ చెరువు దగ్గర పేకాడుతున్న ఆరుగురుని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు. పాలఖండ్యాం, జగన్నాథపురం, పాలఖండ్యాం కూడలికి చెందిన కుప్ప ఆదినారాయణ, కెల్ల పైడిరాజు, నవిరి సూర్యనారాయణ, డొప్ప శంకరరావు, నవిరి సతీష్, డొప్ప అప్పన్నను అదుపులోకి తీసుకొని.. వారి నుంచి రూ.5,640 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అదనపు వసూళ్లకు పాల్పడితే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తప్పవని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈ పథకంలో భాగంగా జిల్లాలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న లబ్ధిదారులకు మూడు రోజుల్లోగా వారి అకౌంట్‌లో నగదు జమవుతోంది. బిల్లుకు అదనంగా రూ.80ల నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నారని, అలా వసూలు చేస్తే ఆ గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. అదనంగా వసూళ్లకు పాల్పడితే వినియోగదారులు 94912 22122 ఫోన్ నెంబరులో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

శిబిరాలు వినియోగించుకోవాలి

ఆమదాలవలస, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పంచాయతీల్లో పశువైద్య ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్థకశాఖ ఏడీ ఆర్.ఆనందరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో రోజుకు రెండు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.1.59లక్షలు

అరసవల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత, అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామివారికి ఆదివారం ఒక్క రోజు రూ.1,59,650 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.46,000, విరాళాల ద్వారా రూ.45,045, ప్రసాదాల ద్వారా రూ.1,08,615 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు.

హామీ నిలబెట్టుకున్న కౌన్సిలర్



పెళ్లి కానుక అందిస్తున్న వార్డు కౌన్సిలర్

ఇచ్ఛాపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి 22వ వార్డు నిరుపేద కుటుంబానికి చెందిన తెలుకల బాలాజీ, పుష్పలత కుమార్తె గీతాసాహు వివాహం చేసుకుంది. మున్సిపల్ ఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు ఆ వార్డు కౌన్సిలర్, టీడీపీ సీనియర్ నాయకులు కాళ్ల దిలీప్ ఆదివారం ఆమెకు రూ.15 వేలు పెళ్లి కానుకగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాళ్ల కృష్ణ, కాళ్ల దేవ, హేమలత దేవి, రిటైర్డు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

సోంపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గొల్లగండి సచివాలయంలో విద్యాసహాయకుడిగా పనిచేసిన రట్టి జయరాం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. జిల్లాలోని సహోద్యోగుల సంక్షేమ సహాయకులందరూ కలిసి రూ.2,25,000 అతడి భార్య చింతాడ శోభారాణికి శనివారం అందజేశారు. తోటి ఉద్యోగులు ఈగల తిరుపతిరావు, యువరాజ్, రమేష్, పాపారావు ఉన్నారు.

● ఇచ్ఛాపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి పొందరవీధికి చెందిన రాము బాదిత్యా గత కొంత కాలంగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. అతడితో పాటు తన తండ్రి కూడా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ10వేలు సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు ధనుష్‌రంగా, గుణశ్రీ, దామోధర్ బాదిత్యా, సురేష్ పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యానికి..



సాయం అందిస్తున్న గ్రామస్థులు

గార, జనవరి 19(ఆంధ్రజ్యోతి): బూరవల్లి గ్రామానికి చెందిన డిక్కల పద్మలోచన, వినీతల చిన్న కుమారుడు చేతన్(3) గుండె వ్యాధితో, పెద్ద కుమారుడు శశాంక్(5) పేగుకు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీరి వైద్యానికి రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న వీరికి బూరవల్లి గ్రామస్థులు రూ.1 లక్షను ఆదివారం ఆ కటుంబానికి అందించారు

బస్సెక్కాలంటే ఎన్ని కష్టాలో..

● స్వగ్రామాల నుంచి తిరుగు పయనమైన వలసజీవులు

● కిటకిటలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్

● రద్దీ రూట్లలో అదనపు సర్వీసులు



నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద ప్రయాణికుల రద్దీ

అరసవల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సంక్రాంతి సెలవులకు దూరప్రాంతాల నుంచి ఉద్యోగులు, విద్యార్థులు, వలస వెళ్లినవారు పెద్ద ఎత్తున స్వగ్రామాలకు చేరుకున్నారు. సందడిగా సంక్రాంతి పండగ చేసుకుని తిరుగు ప్రయాణం అవుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ భారీ సంఖ్యలో ప్రయాణికులు చేరుకోవడంతో జనసంద్రంగా మారింది. ముఖ్యంగా శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు పెద్ద ఎత్తున నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద భారీగా క్యూలో నిల్చున్నారు. దీంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయి, నిలబడేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. టిక్కెట్లు తీసేందుకు, బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రద్దీ మరీ ఎక్కువ కావడంతో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముందుగా ఊహించిన విధంగానే విశాఖ మార్గంలో వెళ్లేందుకు ప్రయాణికులు పెద్ద ఎత్తున వస్తారని, అదనపు బస్సులు, అలాగే పల్లెవెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా పంపించారు. అయినా సరే ఆదివారం రాత్రి కూడా రద్దీ కొనసాగింది. అదనపు సర్వీసులు నడిపినా ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేయకపోవడం విశేషం.

ప్రత్యేక చర్యలు తీసుకున్నాం

సంక్రాంతి రద్దీని ముందుగానే ఊహించి తిరుగు ప్రయాణానికి సంబంధించి రద్దీగా ఉండే రూట్లలో అదనపు బస్సులు నడిపాం. ప్రత్యేకించి విశాఖ వైపు వెళ్లేందుకు అధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తారు. అందుకోసం ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నిరంతరం ఏర్పాటు చేశాం. అలాగే దూర ప్రాంతాలైన విజయవాడకు ఆరు, రాజమండ్రి నాలుగు, అమలాపురానికి మూడు అదనపు సర్వీసులు నడుపుతున్నాం. ప్రయాణికులకు ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే సదుపాయం కూడా కల్పించాం.

\- అమరసింహుడు, డిపో మేనేజర్

వైసీపీ నేతలు భూ కబ్జాదారులు

● ప్రభుత్వ భూముల ఆక్రమించుకున్నారు.. రక్షణ బాధ్యత ఉద్యోగులదే

● ఎమ్మెల్యే కూన రవికుమార్



రీసర్వే ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్

సరుబుజ్జిలి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ పాలనలో రీసర్వే పేరుతో ఎనిమిది లక్షల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు కబ్జా చేసి, తమ పేరున నమోదు చేయించుకున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. ఆదివారం యరగాం గ్రామంలో నిర్వహించిన రీసర్వే ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి, కోదండరామ ఆలయాలకు చెందిన 11.75 ఎకరాల దేవదాయ భూముల నిర్వహణపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవదాయ భూములతో పాటు గ్రామాల్లో ఉన్న ప్రతి ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామంలోని రెండు చెరువులను డీపట్టాల ద్వారా కొంతమందికి ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని, వెంటనే వాటిని సరిచేసి చెరువులను కాపాడాలని అధికారులు ఆదేశించారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో అనేక తప్పులు నమోదు కావడంతో కూటమి ప్రభుత్వం నిర్వహించిన గ్రామ సదస్సుల్లో భూ సమస్యలపై నాలుగు లక్షల ఫిర్యాదులు అందాయన్నారు. వీటన్నింటినీ సరిచేసి ప్రభుత్వ భూములను కాపాడడానికి ప్రస్తుత ప్రభుత్వం రీసర్వే ప్రారంభించి యరగాం గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.మధుసూదన్, డీటీ జగదీష్, టీడీపీ నాయకులు శివ్వాల సూర్యనారాయణ, అంబళ్ల రాంబాబు, నూక కోటి, సర్వేయర్ సూర్యనారాయణ, రెవెన్యూ అధికారులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాకవి యోగి వేమన



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, జేసీ తదితరులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తత్వవేత్త యోగి వేమన సామాన్యులకు సైతం అర్థమయ్యేలా పద్యరచన చేసిన ప్రజాకవి అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలోని లోపాలను ఎత్తి చూపుతూ, ప్రజలను చైతన్యవంతుల్ని చేసిన ఆయన పద్యాలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ, టీడీపీ నాయకుడు శీర రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..



నివాళులర్పిస్తున్న ఏఎస్పీ కేవీ రమణ

శ్రీకాకుళం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఏఎస్పీ (అడ్మిన్) కేవీ రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ రమణ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని సమస్యలను భిన్నకోణంలో దర్శించి తన పద్యాల్లో ప్రదర్శించారని కొనియాడారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాలకొండ రోడ్డును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం

అరసవల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ఏడురోడ్ల జంక్షన్ నుంచి కాంప్లెక్స్ వైపు వెళ్లే రోడ్డును సర్వాంగసుందరంగా, ఎంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో కలిసిన పలువురు వర్తకులతో ఆయన మాట్లాడుతూ.. రోడ్డు అభివృద్ధిలో అందరి సహకారం అవసరమన్నారు. అందరి ఆమోదంతో మరింత మెరుగ్గా రోడ్డును తయారు చేద్దామన్నారు. ఈ రహదారిలో సెంటర్ పార్కింగ్‌ను అందరికీ ఆమోదయోగ్యంగా తయారు చేసి, విద్యుద్దీపాలతో, పర్యావరణహిత మొక్కలను నాటి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా వర్తకులు ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పాలకొండ రోడ్డులో గల వివిధ వర్తక, వాణిజ్య, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

కోర్టు కానిస్టేబుళ్ల విధులు కీలకం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పోలీసులకు, న్యాయస్థానాలకు మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తూ విధులను నిర్వహిస్తున్న కోర్టు కానిస్టేబుళ్ల విధులు చాలా కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసుస్టేషన్ల కోర్టు సిబ్బంది, కోర్టు లైజన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసు నమోదు నుంచి తుది తీర్పు వరకు, ఈ మధ్య కాలంలో జరిగిన కేసులకు సంబంధించిన ప్రతీ అంశాన్ని పూర్తి వివరాలతో సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే కోర్టు కేసుల విచారణ విధానం, వివిధ దశల్లో ఎదురవుతున్న సమస్యలు, సమన్లు, వారంట్ల అమలు, సాక్షులను కోర్టులో హాజరు పరచడం, కేసు అభియోగ పత్రాలు దాఖలు, ఇతరత్రా విధివిధానాలపై ఆయన సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కోర్టులో కేసుకు సంబంధించి ప్రతీ రోజూ కేసు డైరీ రూపంలో జత చేయాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సలహాలు, సూచనలు పాటిస్తూ శిక్షల శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'కలిశెట్టి' కుటుంబీకుల ఆత్మీయ కలయిక



వీఎన్‌పురం గ్రామంలో సందడి చేసిన కలిశెట్టి కుటుంబం

రణస్థలం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వీఎన్ పురం గ్రామంలో కలిశెట్టి వారి కుటుంబ సభ్యులు ఆదివారం సందడిగా గడిపారు. ముఖ్యఅతిథిగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హాజరయ్యారు. ఏటా సంక్రాంతి తర్వాత కలిశెట్టి కుటుంబ ఆత్మీయ కలయిక నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా కలిశెట్టి కుటుంబీకులంతా ఒక్క చోటకు చేరి సందడిగా గడిపారు. ఒకరినొకరు అభినందనలు తెలుపుకున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ఆమదాలవలస, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సీఎస్‌పీ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆదివారం ఎస్ఐ సనపల బాలరాజు ఆధ్వర్యంలో మూడు చోట్లను రోడ్డు ప్రమాద ప్రాంతాలుగా గుర్తించారు. కొర్లకోట జంక్షన్, సెయింట్ ఆన్స్ పాఠశాల జంక్షన్, తాళ్లవలస సమీపంలో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి రోడ్డుకు అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. పోలీసులు చేపట్టిన ఈ చర్యలతో కొంతమేర రోడ్డు ప్రమాదాలు నివారణకు దోహదపడతాయని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం



ర్యాలీలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తరిణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాంతకల్యాణ్ అనురాగ నిలయంలో ఆదివారం సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం త్యాగరాజ స్వామి ఘనరాగ పంచరత్న కృతుల బృందగానం అలరించింది. వాయులీనంపై దూసి రమేష్, బ్రహ్మాజీ, మృదంగం మండా శ్రీనివాసరావు వాయించారు. నిక్కు అప్పన్న, కామేశ్వరరావు, కనుగుల దుర్గా శ్రీనివాస్, బండారు రమణమూర్తి పాల్గొన్నారు.

● కవిటి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంగీతానికే ఆరాధ్యుడుగా త్యాగరాజస్వామి నిలుస్తాడని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. గొండ్యాలపుట్టుగలో ఆదివారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులంతా అశోక్‌ను సత్కరించారు. కళాకారుల త్యాగరాజ వేషధారణతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సంగీత విభావరి నిర్వహించారు.



కంచిలి: జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వవిద్యార్థులు



కవిటి: పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కంచిలి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09, 2010-11 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమావేశాలు వేరువేరుగా పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఒకరికొకరు పరిచయం చేసుకుని, ఆనాటి స్థితిగతులు తెలియజేసుకొని ఆనందంగా గడిపారు.

● కవిటి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కవిటి, రాజపురం, బొరివంక గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఆదివారం ఆయా పాఠశాలల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. రాజపురంలో 1996-2001లో, బొరివంకలో 1987-88లో, కవిటిలో 1993-98లో చదివిన వారు కలుసుకున్నారు.

వివాహిత దారుణహత్య

● వివాహేతర సంబంధం కోణంలో దర్యాప్తు

● 24 గంటల తరువాత వెలుగులోకి ఘటన

● అనుమానితుడి కోసం పోలీసుల గాలింపు

శ్రీకాకుళం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. 24 గంటల తర్వాత ఆదివారం హత్యోదంతం వెలుగులోకి రావడంతో నగరవాసులు ఉలిక్కిపడ్డారు. కుటుంబ సభ్యులు, టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత(53) శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో దుస్తులు తెచ్చుకునేందుకు శ్రీకాకుళం వెళ్తున్నట్టు తన భర్తకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. సాయంత్రమైనా ఆమె రాకపోవడం, ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం రాలేదు. ఆదివారం ఉదయానికి ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త, కుమారుడు శ్రీకాకుళం నగరంలో వెతికారు. అయితే నగరంలోని న్యూ కాలనీలో గల ఓ ప్రైవేట్ కళాశాల వద్ద ఆమె తీసుకువచ్చిన వాహనాన్ని గుర్తించారు. దీంతో సమీపంలోని భవనాలకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఆమె ఓ ప్రముఖ వైద్యుడి ఇంటికి ఎదురుగా ఉన్న భవనంలోకి వెళ్లడాన్ని గుర్తించారు. ఆ భవనంలోకి వెళ్లి పరిశీలించగా.. ఆమె రెండో అంతస్థులోని ఓ ఇంటి బాత్‌రూమ్‌లో విగతజీవిగా పడి ఉండడాన్ని గుర్తించారు. దీంతో ఆమె భర్త రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు ఘటనా స్థలానికి క్లూస్ టీమ్‌తో చేరుకుని వివరాలు సేకరించారు.

వారి మధ్య ఏమి జరిగింది?

హత్యకు గురైన వివాహిత భర్త రిటైర్డు ఆర్మీ ఉద్యోగి. ఈమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే ఆ వివాహితకు శ్రీకాకుళం నగరానికి చెందిన అండలూరి శరత్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసిందనే ఆరోపణలు ఉన్నాయి. శరత్ శ్రీకాకుళంలో తన తండ్రితోపాటు జనరేటర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. న్యూకాలనీలో హత్య జరిగిన ఇంట్లోనే ఒంటరిగా ఉంటున్నాడు. శనివారం పనిమీద నగరానికి వచ్చిన వివాహిత.. న్యూ కాలనీలోని ఓ ప్రైవేట్ కళాశాల వద్ద తన వాహనాన్ని పార్క్ చేసి.. బట్టల బ్యాగుతో నేరుగా శరత్ ఉంటున్న ఇంటికి వెళ్లిన దృశ్యాలు చుట్టుపక్కల భవనాలకు అమర్చిన సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. అయితే శరత్ ఉంటున్న ఇంట్లోని బాత్‌రూమ్‌లో ఆమె హత్యకు గురవడం చూస్తుంటే, వీరి మధ్య వాగ్వాదం జరిగి.. ఆమె ముఖంపై తలగడ పెట్టి ఊపిరాడకుండా చేసి, హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. శరత్ ఆచూకీ లేకపోవడంతో పరారై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం అతడి కోసం గాలిస్తున్నారు. శరత్ దొరికితే అసలు విషయం బయటపడతాయని పోలీసులు చెబుతున్నారు. కాగా.. వివాహిత ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు 30 తులాల బంగారు ఆభరణాలు ధరించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. విగతజీవిగా మారిన తర్వాత ఆ ఆభరణాలు లేవని ఆరోపిస్తున్నారు. వివాహిత భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

గార, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఆర్.జనార్దనరావు అన్నారు. ఆదివారం ఉదయం గార మూడు రోడ్ల కూడలి వద్ద ఆయన వాహనాలు తనిఖీ చేశారు. జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

బుడార్సింగికి బస్సునడపాలి

సోంపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సోంపేట నుంచి పొత్తంగి మీదుగా మందస మండలం బుడార్సింగికి ఆర్టీసీ బస్సు నడపాలని కొర్లాం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆయన స్వగృహంలో కలుసుకుని వినతి పత్రం అందించారు. జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి, పెద్దింటి సోమేశ్వరరావు, రాంబుడ్డి జానకిరావు, పెద్దింటి సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు కంటిపరీక్షలు

సోంపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతావారోత్సవాల్లో ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. భాగంగా సోంపేట, బారువ ఎస్ఐలు లవరాజు, హరిబాబునాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఆరోగ్యవరం కంటి ఆసుపత్రిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మరమ్మతులు చేయించండి

కవిటి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జగతి పంచాయతీ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ లైన్లు మరమ్మతులు చేయించండని రైతులు ఆదివారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అశోక్‌కు వినతిపత్రాన్ని అందించారు. రామయ్యపుట్టుగలోని విప్ కార్యాలయం వద్ద రైతులు సమస్యను వివరించారు. బొరివంక సబ్‌స్టేషన్ నుంచి వ్యవసాయ పనులకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఈ లైన్‌లో విద్యుత్ పరికరాలన్నీ మరమ్మతులకు గురై ఉన్నాయని తెలిపారు. వీటిని మార్పు చేసేందుకు పరికరాలు వచ్చినా పనులు జరగటంలేదని త్వరగా పనులు జరిగేలా చూడాలని కోరారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో బి.సీతారామమూర్తి, బి.నారాయణమూర్తి, టి.హరనాథ్, పి.వెంకటరమణ, శరత్‌బాబు ఉన్నాయి.

వార్షికోత్సవం ప్రారంభం

జి.సిగడాం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆనందపురంల షిర్డీసాయి ఆలయంతో పాటు 46 అడుగుల నాగసాయి, 100 అడుగుల సాయికోటి మహాస్తూపం వార్షికోత్సవం ఆదివారం ప్రారంభమయ్యాయి. బాబాను భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. ఎనిమిది రోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 23 నుంచి 26 వరకు సామూహిక సత్యవ్రతాలు, అన్నసమారాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

జి.సిగడాం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దేవరవలస పంచాయతీ మంగంపేట గ్రామానికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) చొరవతో బీటీ రహదారి పనులు ఆదివారం ప్రారంభయ్యాయి. ఈ రహదారి పూర్తయితే ప్రజల కష్టాలు తీరాయని సర్పంచ్ వెంకటరావు తెలిపారు.



చరిత్ర ఘనం.. పర్యవేక్షణ శూన్యం

- ఇదీ పట్టుమహాదేవి కోనేరు దుస్థితి
- పిచ్చిమొక్కలు, దుర్గంధంతో నిండిన వైనం

టెక్కలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈ కోనేరును చూస్తున్నారుగా.. ఇదేదో సాధారణ మైన చెరువు అనుకునేరు.. అలా అనుకుంటే పొరపాటే.. దీనికి రెండు శతాబ్దాల చరిత ఉందని తెలుసా.. ఈ కోనేరును టెక్కలి పట్టణ ప్రజలు తాగునీటి అవసరాలకు వినియోగిం చుకునేవారు. అయితే అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ కోనేరు ఇప్పుడు ఆక్రమణలకు గురై, నామ రూపాలు కోల్పోయి మురుగునీటితో ఇలా దర్శనమిస్తోంది. కళ తప్పి ఓ చిన్న చెరువులా తయారవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని చెప్పొచ్చు.

చరిత్ర ఇలా..

1797లో ఈస్టిండియా కంపెనీ ఆధీనంలోకి వెళ్లిన టెక్కలిని 1816 నుంచి 1832 వరకు పర్లాకిమిడి రాజు గణపతి పద్మనాభ్ దేవ్ పాలించారు. ఈయన కుమారులు గోవిందనాథ్ దేవ్, కృష్ణచంద్రదేవ్. టెక్కలి సంస్థానాన్ని రెండుగా విభజించిన తరువాత టెక్కలి ఎస్టేట్‌ను గోవింద నాథ్ దేవ్‌కు, నందిగాం ఎస్టేట్‌ను కృష్ణచంద్రదేవ్‌కు అప్పగించారు. టెక్కలి రాజుకు మగ సంతానం లేకపోవడంతో తన కుమార్తె పట్టు మహాదేవికి గుర్తుగా సుమారు 200 ఏళ్ల కిందట ఈ మంచినీటి కొలనును తవ్వించారు. ఆ కొలనే నేడు పట్టుమహాదేవి కోనేరు గా పిలవబడుతోంది. ఎస్టేట్‌లు పోయి ప్రజాపాలన వచ్చిన తరువాత కూడా ఈ కోనేరు వల్ల అనేక సంవత్సరాలు తాగునీటి అవసరాలకు వినియోగించుకున్నారు. అయితే నేడు ఈ కోనేరుపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా పూడికలు, పిచ్చి మొక్కలు, మురు గునీటితో నిండిపోయింది. ఈ కోనేరును టెక్కలి ఎమ్మెల్యేగా హనుమంతు అప్పయ్యదొర రెండు దశాబ్దాల కిందట కొంత మేర పూడికలు తొలగింపు ప్రక్రియ చేపట్టినప్పటికీ అప్పట్లో పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరు వాత పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధి తమ భుజాల మీద వేసుకుంటామని గొప్పలు చెప్పిన అప్పటి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ ఆ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. సుమారు రూ.50 లక్షలతో రిటైనింగ్ వాల్స్, పాత జాతీయ రహదారి వైపు దుకాణ సముదాయాలు ఏర్పాటుకు పనులు చేపట్టి అక్కడితో నిలిపివేశారు. ఈ కోనేరులో మురుగునీటిని తొలగించే ప్రక్రియ చేపట్టగా అది వైసీపీ కార్యకర్తలకు ఉపాధిగా మారిందన్న విమర్శలొచ్చాయి. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు ఈ కోనేరు అభివృద్ధిపై దృష్టి సారించారు. తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ పనులను ఉపాధి హామీ కింద చేపట్టేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటు న్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి కోనేరు చరిత్రను తెలిసేలా తగు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


వ్యర్థాలు, పూడికలతో నిండిన పట్టుమహాదేవి కోనేరు

క్రైం కార్నర్

డివైడర్‌ను ఢీకొని..

- బైక్‌పైకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం
- ఇద్దరు ఒడిశా వాసులు మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- ఇచ్ఛాపురంలో ఘటన

ఇచ్ఛాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి సంతపేట జంక్షన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బొనసల గ్రామానికి చెందిన ఇసురు వినోద్ రెడ్డి(24), పాత్రపూర్ బురడ గ్రామానికి చెందిన బమ్మిడి కార్తీక్(24) ద్విచక్ర వాహనంపై పనుల నిమిత్తం ఇచ్ఛాపురం వచ్చారు. తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వెళ్తూ భువనేశ్వరి అమ్మవారి ఆలయ జంక్షన్‌కు చేరుకునే సరికి బైక్ అదుపు తప్పి అవతలి రోడ్డుపైకి దూసుకుపోయింది. ఇదే సమయంలో అటువైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న సోంపేట మండలం మాకన్నపురానికి చెందిన చిత్రాడ రమేష్, తాళభద్రకి చెందిన హనుమంత్ పల్లి కార్తీక్, చిత్రాడ సిద్దార్థను ఢీకొట్టారు. దీంతో ఒడిశాకు చెందిన ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. చిత్రాడ రమేష్ కాళ్లు, చేతులు విరిగిపోగా హనుమంత్‌పల్లి కార్తీక్ కాలు విరిగిపోయింది. చిత్రాడ సిద్దార్థ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

యువకుడి ఆత్మహత్య

నందిగాం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెద్దతామరాపల్లి గ్రామానికి చెంది న గోరు ఖగేశ్వరరావు(22) ఆదివారం సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చేనేత కార్మికుడు గోరు వెంకటరమణ, కుమారి దంపతుల కుమారుడు ఖగేశ్వరరావు. డిగ్రీ వరకు చదువుకున్నాడు. మూర్ఛ వ్యాధితో బాధపడుతూ మానసిన ఆందోళనకు గురయ్యాడు. దీంతో ఆదివారం తండ్రి పనిమీద బయటకు, తల్లి కన్నవారి గ్రామం కంట్రగడ వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని అటుగా వెళ్తున్న వాళ్లు గమనించి తల్లిదండ్రులకు సమాచా రమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ జీవీ రమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఖగేశ్వరరావు (ఫైల్)

పోలీస్ స్టేషన్ ఆవరణలో పరిశుభ్రత


స్టేషన్ పరిసరాలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

పలాస, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం సిబ్బంది స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ పి.సూర్య నారాయణ, ఎస్ఐ ఎం.చంద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది కార్యాలయం ఆవరణలో చెత్త, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు.

శ్మశాన వాటికలో శ్రమదానం


శ్మశాన వాటికలో శ్రమదానం చేస్తున్న యువకులు

వజ్రపుకొత్తూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పూండి-గోవిందపురం శ్మశాన వాటికలో ఆదివారం స్థానిక కృష్ణార్జున యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. పేరుకుపోయిన ముల్ల పొదలు తొలగించి రోడ్డును శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిరు. అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో శ్రమదానం చేసినట్లు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు తెలిపారు. శ్రమదానంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కర్ని రమణ, యువజన సంఘం సభ్యులు సారథి, ఈశ్వర రావు, వినోద్ గణేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

టెక్కలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశ్వకవి యోగి వేమన జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆ సంఘ అధ్యక్షుడు చిన్నబాబురెడ్డి, ఏదూరు శ్రీనివాసరెడ్డి, మక్క శంకరరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆసు పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజు, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఫిర్యాదులతో పది మందిపై కేసు

నందిగాం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నందిగాం ఎస్సీ కాలనీకి చెందిన ఇరు వర్గాల మధ్య వివాదం జరగ్గా పది మందిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఢిల్లేశ్వరరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఒక పత్రికలో వైసీపీ నాయకుడు జద్యాడ జయరాంపై వస్తున్న కథనాలను తామే ఇచ్చామనే కక్షతో దాడి చేసి గాయపరిచారని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు గౌడు మదన్‌మోహన్ మురళీకుమార్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో జయరాంతోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశా మన్నారు. తాను వీధిలోకి వస్తుండగా మదన్ మోహన్ మురళీకుమార్ కారు తగిలించి దాడి చేశారని జద్యాడ వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మదన్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

అ‘పూర్వ’ కలయిక


వజ్రపుకొత్తూరు: అక్కుపల్లిలో 1996-97లో చదివిన విద్యార్థులు


జలుమూరు: తిమడాం పాఠశాలలో 2007-08లో చదువుకున్న విద్యార్థులు


నరసన్నపేట: మాకివలస పాఠశాలలో 1990-91 బ్యాచ్ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు/జలుమూరు/నరసన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వివిధ పాఠశాలల్లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం నిర్వహించారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి హైస్కూల్‌లో 1996-97, జలుమూరు మండలం తిమడాం ఉన్నత పాఠశాలలో 2007-08, నరసన్నపేట మండలం మాకివలసలో 1990-91లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ కలయిక నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని మధురానుభూతి పొందారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న సహచరులకు సాయమందించాలని నిర్ణయించారు. కార్యక్రమాల్లో ఆయా బ్యాచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.

అనుసంధానం.. అర్ధాంతరమేనా?

(ఐదో పేజీ తరువాయి)


నందికొండ వద్ద అసంపూర్తిగా ఉన్న కాలువ పనులు

పనులు అక్కడే నిలిచిపోయాయి. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస, నందికొండ తదితర ప్రాంతాల్లో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు నాయుడు ఏడాదిన్నర కిందట జిల్లాలో ప్రాజెక్టులు పరిశీలించారు. ఆ సమయంలో నదుల అనుసంధానం పనులు నిలిచిపోయిన విషయాన్ని స్థానిక టీడీపీ నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాము అధికారంలోకి వస్తే సాగునీటి ప్రాజెక్టులకు, నదుల అనుసంధానానికి ప్రాధాన్య మిస్తామని అప్పట్లో చంద్రబాబు భరోసా ఇచ్చారు. తాజాగా ఇటీవల బడ్జెట్‌లో నదుల అనుసంధానానికి నిధులు కేటాయించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి త్వరితగతిన అనుసంధానం పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

ఇంటర్ విద్యలో.. సమూల మార్పులు!

(ఐదో పేజీ తరువాయి)

పరీక్షలు జరుగుతున్నాయి. నూతన విధానంలో మార్కులు అదే మాదిరి ఉన్నా, ఉత్తీర్ణత శాతం కోసం ప్రథమ సంవత్సరం మార్కులు పరిగణనలోకి తీసుకోరు. ద్వితీయ సంవత్సరం మార్కులను పరిగణనలోకి తీసుకుని ఉత్తీర్ణత శాతం కేటాయిస్తారు. ఈ విధానంలో ప్రతి సబ్జెక్టుకీ అంతర్గత మార్కులు ఉంటాయి. ఆర్ట్స్ గ్రూప్‌లో ఇంగ్లీష్‌తో పాటు ఎంచుకున్న సబ్జెక్టుకు థియరీ మార్కులు 80, ఇంటర్నర్ మార్కులు 20 ఉంటాయి. సైన్స్ సబ్జెక్టులో థియరీ 70 మార్కులు, ఇంటర్నల్ 30 మార్కులు ఉంటాయి. ప్రశ్నాపత్రాల్లో ఒక మార్కు, 5,6 మార్కుల ప్రశ్నలను ప్రవేశపెట్టనున్నారు.

పాఠ్యపుస్తకాలలో మార్పులు ఇలా..

మొదటి సంవత్సరం సైన్స్ సబ్జెక్టులలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలలో 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టనున్నారు. రెండో సంవత్సరం ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను అనుసరించి అమలులో ఉన్న సిలబస్‌ను తగ్గించనున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో రెండో సంవత్సరం సైన్స్ గ్రూపులోని ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలను అందజేయనున్నారు. మొదటి సంవత్సర ఆర్ట్స్ గ్రూపులలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ఉన్నత విద్యా మండలి సిలబస్‌కు అనుగుణంగా రూపొందించిన పాఠ్యపుస్తకాలను అందించనున్నారు. సెకండియర్‌లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రస్తుత విధానాన్ని కొనసాగిస్తారు. 2026-27 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ ఉన్నత విద్యామండలి సిలబస్ పుస్తకాలను అందించనున్నారు. ఇక లాంగ్వేజస్ (ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఒరియా) మొదటి సంవత్సరం ఇంటర్ విద్యామండలి పాఠ్యపుస్తకాలను అందించనున్నారు. ఇవన్నీ ఇంటర్ బోర్డు ప్రతిపాదనలు మాత్రమే. ఈ మార్పులకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఈనెల 26లోగా ‘బీఐఈఆర్ఈఎఫ్ఓఆర్ఎంఎస్ ఎట్‌ది రేటా ఆఫ్ జీ.మెయిల్ డాట్ కమ్’ మెయిల్‌కు పంపాలని ఇంటర్‌బోర్డు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సత్యసాయి బోధనలు విస్తృతం చేయాలి

పలాస/పలాస రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సత్యసాయి మందిరాలు, కార్యక్రమాల నిర్వహణపై సత్యసాయి సెంట్రల్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌తో సంస్థ జిల్లా ప్రతినిధులు చర్చించారు. ఈ మేరకు ఆదివారం పుట్టపర్తిలో ఆయనను కలిసి పలు అంశాలపై సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు, పలాస సంస్థల ప్రతినిధి, స్థానిక ట్రస్ట్ ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు తదితరులు చర్చించారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని నమ్మి ఆచరించిన సత్యసాయి బోధనలను విస్తృతం చేయాలని రత్నాకర్ సూచించారు. ఈనెల 31న సత్యసాయి విద్యావిహార్ బహుళ అంతస్తుల భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానం పలికారు. ఆయనను కలిసిన వారిలో తాళాసు శ్రీను, మల్లా శరత్, అల్లాడ ప్రసాద్ ఉన్నారు.


సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌ను కలిసిన పలాస సత్యసాయి సంస్థల నిర్వాహకులు

ఆపదలో ఉన్న వారికి ఆసరా: ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఈ విషయంలో సీఎం చంద్రబాబు ఎల్లవేళలా ముందుంటారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మెళియాపుట్టి మండలం గొప్పిలికి చెందిన సీపాన కేశవ ప్రమాదవశాత్తు మృతి చెందిన నేపథ్యంలో ఆ కుటుం బానికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

తాగునీటి కోసం ఆందోళన

హిరమండలం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలం చిన్నకోరాడ వీధిలో రక్షిత నీటి పథకం కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా కాకపోవడంతో స్థానిక మహిళలు ఆదివారం నిరసన తెలిపారు. నవంబరులో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పి ఉన్న పైప్‌లను తొలగించారని, దీంతో అప్పటి నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. పండగ రోజుల్లో కూడా నీటిని సరఫరా చేయక పోవడంతో నీటిని కొనుగోలు చేసుకోవాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని వారు కోరారు.


నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

జలుమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పోరంబోకు భూములు, చెరువు గర్భాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు జె.రామారావు హెచ్చరించారు. చిన్నదూగాం గ్రామం కాకర్లవాని చెరువును ఆక్రమించి వేసిన పంటలను ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. పోరంబోకు భూముల్లో వేసిన పంటలను తొలగించామని, మరలా ఈ భూముల్లో రైతులు ఏవైనా పంటలు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, మండల సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనాన్ని తొలగించరా?

పలాసరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ భవనాల్లోని ఇటీవల వరకు తరగతు లను నిర్వహించగా విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ పాఠాలు వినేవారు. అయితే రెండునెలల కిందట రణస్థలం మండలంలో పాఠశాల భవన ప్రమాదం జరిగిన నేపథ్యంలో కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ మేరకు గదుల చుట్టూ బారికేడ్లు పెట్టి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆ పరిధిలోకి విద్యార్థులకు వెళ్లకుండా పాఠశాల సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉన్న తాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ భవనాల పక్కనే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థాని కులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రమాదాలు జరగక ముందే శిథిలావస్థకు చేరుకున్న గదులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ డీఈవో ఎస్.విలియమ్స్ వద్ద ‘ఆంధ్రజ్యోతి’ ప్రస్తావించగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.


బొడ్డపాడులో శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల ముందు పెట్టిన హెచ్చరిక బోర్డు

న్యూస్ బాక్స్

నేటినుంచి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

కోటబొమ్మాళి/మందస/నందిగాం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సోమవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహించ నున్నట్లు పశు సంవర్థకశాఖ ఏడీ ఎం.రవికృష్ణ, పశు వైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, డి.శ్రీకాంత్ తెలిపారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, అమ్మ వారు, కోళ్లలో కొక్కెర వ్యాధుల నివారణకు టీకాలు, మం దులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

జీడికి మద్దతు ధరను ప్రకటించాలి

వజ్రపుకొత్తూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంత రైతుల జీవనాధారమైన జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ఉత్తర్వులు జారీ చేయాలని జీడి రైతు సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం బైపల్లిలో కోనేరు కామేశ్వరరావు అధ్యక్షతన సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గౌతు శిరీష ఈ అంశంపై అసెంబ్లీలో ప్రస్తావించినా ఇంతవరకు తదుపరి చర్యలు లేవన్నారు. ప్రస్తుతం జీడి పంట సీజన్ ప్రారంభమవుతున్నందున ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడితో జీడిరైతు సంఘం నేతలతో చర్చిం చేందుకు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తెప్పల అజయ్‌కుమార్, ప్రతినిధులు కోనేరు రమేష్, బత్తిని లక్ష్మీనారాయణ, వాసుపల్లి సాంబమూర్తి, అంబటి రామకృష్ణ, పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే గుర్తింపు

హరిపురం, జనవరి19 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని యాదవ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షుడు డొక్కరి ధనుంజయ అన్నారు. పెద్దలింబుగాం గ్రామంలో ఆదివారం ఎంబీబీఎస్, ఐఐటీ విద్యను అభ్యసిస్తున్న యాదవ సామాజికవర్గ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ డొక్కరి దానయ్య, మాజీ ఎంపీపీ దాసరి తాతారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. చుకొని దానికిగాను కృషిచేయాలని కోరారు. అలాగే నేవీలో అధికారులైన బందాపు శ్రీనిధి, మండల రేష్మ, సుష్మలను అభినందించి వీరి తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మాజీ జడ్పీటీసీ అందాల శేషగిరి, రామారావు, పూస రమణ, భాస్కరరావు, ఈశ్వరరావు, బతకల చంద్రయ్య, తివ్వయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు, నేరాలకు దూరంగా ఉండాలని సీఐ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం తిర్లంగి, కొండభీంపురం గ్రామాల్లో ‘సంకల్పం’లో భాగంగా గ్రామస్థులతో మాట్లాడారు. మత్తుపదార్థాలు సేవించడం, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. రహదారి భద్రత విషయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అపరిచిత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాము, ధవళ రామచంద్రుడు, పలువురు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

పాతపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పొందిన అంశాల్లో నైపుణ్యం సాధించి అవకాశాలను అందిపుచ్చుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి అన్నారు. స్థానిక ఏపీమోడల్‌స్కూల్ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పండగ సెలవుల్లో 10 రోజుల పాటు నిర్వహించిన ఇంటర్న్ షిప్ శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ఐటిఅండ్ ఐటీఈఎస్ ట్రైనర్ యెన్ని నరేష్ కుమార్ వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణగోడ నిర్మించండి

ఎల్.ఎన్.పేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వాడవలస గ్రామ సమీపంలో వంశధార నది ఒడ్డు కోతకు గురికాకుం డా ఉండేందుకు నిర్మించిన గ్రోయిన్ (రక్షణ గోడ) గతంలో నదికి వచ్చిన వరదల ధాటికి కూలి పోయింది. దీంతో ఏటా వర్షాకాలంలో నదిలో నీటి ప్రవాహం పెరిగినప్పుడల్లా గ్రామ స్థులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. వరదల కారణంగా ఎప్పుడు నీరు గ్రామంలోకి చేరి ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తు న్నారు. వంశధార నదికి ఉధృతంగా నీరు వచ్చిన సమయం లో గండిపడితే పంట పొలాలతో పాటు గ్రామం కూడా నీటి లో మునిగిపోయేప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి గ్రోయిన్ నిర్మాణం చేపట్టే చర్యలు తీసుకోవాలని స్థానికులు సీహెచ్ భాస్కరరావు, పి.మల్లేశ్వర రావు, ఎ.రమణమూర్తి తదితరులు కోరుతున్నారు.


వాడవలస సమీపంలో కూలిపోయిన గ్రోయిన్